# ★ 'ఆవతలవైపు' ★

'కృష్ణశ్రీ'

★

'హల్లో! 'మనవిచేస్తున్నాను. ఆ బిల్లులన్నీ అమలులోకి వస్తే జమీందారీ సమస్యాపరిష్కారం అతి సహజంగా వచ్చేస్తుంది.'

..........

'కృత్రిమంగా వస్తోందనికాదు. ఇప్పటి వాతావరణంలో ప్రజాభ్యుదయాకాంక్షకంటె జమీందారుల సంపదయెడ—మన్నించండీ, నా కొద్ది జ్ఞానానికి మంచిమాట స్ఫురించడములేదు—అసూయే నిండిఉండేమో అనిపిస్తోంది.'

..........

'వివరిస్తున్నాను. దేశాభ్యుదయం సాధించడం కోసము తీసుకొచ్చే బిల్లులన్నీ సత్య అహింసల మీద ఆధారపడాలని నా ఆశయం.'

..........

'మన్నించండి. నేను చెప్పేది నేను పూర్తిగా నమ్మిన విషయమేగాని నాయకుల అభిప్రాయాలకి శుకానువాదంమట్టుకు కాదని మనవి చేస్తున్నాను.'

..........

'ఇదుగో మనవిచేస్తున్నాను. శతాబ్దాలతరబడిని బానిసత్వంలో మునిగిన మన జాతి నేడు మేలుకుంటోంది. ఇలాంటప్పుడు జాతినంతా ఏకం చేసే ప్రయత్నాలు బ్రహ్మాండంగా జరగాలి. కులాధిక్యతత్వాలూ, వృద్ధసాంప్రదాయ గౌరవాలూ, శాఖాభిమానాలూ, అన్నిటినీమించి, కొండంత స్వార్థపరత్వమూ వ్యక్తుల్ని ఆవరించివున్నాయి. వీటినన్నిటినీ కడిగెయ్యాలంటే సత్య అహింసలే శరణ్యాలు.'

..........

'అవును. ఈ రెండు మాటలకీ అర్థప్రచారంకంటె శబ్దప్రచారం ఎక్కువగా వుంది. చిత్తగించండి. నాకు వాటినిగురించి బోధపడినదాన్ని చెప్తాను. 'సత్యము' అంటే వాస్తవంగా వున్నస్థితి. అహింస అంటే హింస చెయ్యకపోడము.'

............

'హింస అంటే బాధాకరమైన హింస. ఆపరేషను చెయ్యడం హింస కాదు. మృత్యుదేవత కోరల్లో చిక్కి బాధపడే ప్రాణిని చంపడం హింసకాదు.'

.... .... ....

'పోను. అసలు విషయానికే వస్తాను. జాతిలోని వ్యక్తులందరూ, వాస్తవంగా వున్నస్థితిని గుర్తించుకుని, హింసాకరంగాని పద్ధతిలో సంస్కారము తీసుకురావడానికి ప్రయత్నించాలని నా తాత్పర్యము.'

.... .... ....

'ఈ బిల్లు తీసుకురావడంలో సత్యం పూర్తిగా గుర్తించబడలేదనీ, ఇది అహింసా పద్ధతిలో జరగడములేదనీ నా అభిప్రాయము.'

.... .... ....

'జమీందారులు ప్రజలకు చేసిన మేళ్లు అనేకం వున్నాయి. పర్లాకిమిడి, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, బెజవాడ, నెల్లూరు కాలేజీలు తరతరాలుగా వెదజల్లిన విద్య జమీందారుల చేతిచలవే. పర్లాకిమిడి, విజయనగరం, సింహాచలం, విశాఖపట్నం, తుని, పిఠాపురం మొదలైన వూళ్లలో రోగులకి జరిగిన చికిత్స జమీందారుల కారుణ్యఫలమే. కాశీ, రామేశ్వరం బాటలోని సత్రవులు జమీందారుల వదాన్యతే. విజయనగర సంస్కృత కళాశాల, గాన పాఠశాల, సింహాచల వేదపాఠశాల మొదలైనవి జమీందారుల కళాభిమానంవల్ల రూపొందినవే. పెద్దపని ఏది జరగాలన్నా జమీందారులే చేశారు. ప్రజలు చెయ్యలేరు. రామారావువంటి చిత్రకారుణ్ణీ, వెంకటస్వామినాయుడువంటి సంగీతమూర్తుల్నీ, సర్పవర గోపుర నిర్మాతలవంటి వాస్తుశాస్త్రజ్ఞుల్నీ ప్రజలు పోషించలేరూ, పోషించలేదుకూడాను!'

.... .... ....

'గవర్నమెంటా? గవర్నమెంటు ఒక వ్యక్తి కాదండీ. అది ఒక మిషను. ఒక వ్యక్తి నా

బందో అని కొట్టుకుని చేసినట్టు గవర్నమెంటు చెయ్యలేదండీ. ఇప్పటికీ చూడండి. ఎన్ని హైస్కూళ్లున్నాయో జమీందారులు నడిపేవి!'

.... .... ....

'చిత్తం మ్యునిసిపాలిటీ స్కూళ్లు కంటె మీ రెరిగినట్టు లేదు. 'గాజుగొట్టాలు కొంటే బద్దలయిపోతున్నాయి, లోహంతో చేయించరాదా' అని ఎన్నికల్లో చేర్మను అయిన — గారు ప్రశ్న వేశారు మా వూళ్ళోని రసాయనాధ్యాపకుణ్ణి.'

.... .... ....

'అవును లెండి. కుక్కల్ని కొన్నవాళ్లూ వున్నారూ, అమ్మలక్కలవెంట పడ్డవారూ వున్నారు. జైలుకి వెళ్లి వచ్చినవారిలో అలాటివారు లేరా? జమీందారులు అందరూ అలాగ లేరు. జమీందారులందరూ అలాంటివారే అన్నది సత్యము కాదు.'

.... .... ....

'అసలు రైతులకీ జమీందారులకీ జరిగే ఘర్షణ రెండు ప్రత్యేక స్వార్థాలకి జరిగే పోరాటమండీ. జమీందారులు విలాసులైపోతున్నారే, రైతులు మాత్రం ఏం తక్కువ తింటున్నారూ? పల్లెటూళ్లలో తగలబడిన ప్రతి ధాన్యంకుప్పకీ లేదా గడ్డికుప్పకీ వెనకాల వ్యభిచారం వుంటుంది గుర్తించండి మీరు. జమీందారులు సారాయి తాగితే రైతులు కాఫీలు ప్రారంభించారు.'

.... .... ....

'కాఫీ ఒక సుఖమని గాని అవసరమని గాని నమ్మనండీ నేను. దూబరా ఖర్చుల్లో కాఫీ ఒకటని నా అభిప్రాయం. దాని మాట అలా ఉండనియ్యండి. అసలు విషయానికి వస్తాను. నేటి తెలుగువ్యక్తి ఎక్కువ ఖర్చువైపు ఉరకలు వేసుకుంటూ పరిగెడుతున్నాడు. చుట్టా, బీడీ, కాఫీ, బస్సూ, సినీమా, సొమ్ము పీల్చేస్తున్నాయి. రైతు కూడా అందరితో పాటే; ఖర్చు ఎక్కువ చేసుకుని, వచ్చే రాబడి చాలడంలేదని గోలచేస్తున్నాడు. ఈ పరుగుకి అంతమన్నది లేదు.'

"........."

"చిత్తం. రైతే కాదు, జమీందారు కూడా అంతేలెండి. వీరంతా మదరాసులోనే ఉంటున్నారన్న విషయంకూడా గుర్తులో వుంది నాకు. నా గోల ఏమిటంటే, ఘనమైన ఉపకారం జమీందారులు చేసినప్పుడు అది మన జన్మహక్కనుకునీ, ఏదో అపకారం జరిగినప్పుడు హాహాకారాలూ ప్రచారమూ చేస్తున్నామంటాను. ఒక్క జమీందారుల్లోనే కాదు, పోస్టలు బంట్రోతుల్లో, పాకీ పనివాళ్ళల్లో, రైల్వే కూలీలలో, మిల్లు పనివాళ్లలో, నాన్ గెజెటెడూ, గెజెటెడూ ఆఫీసర్లలో, అందరిలోనూ స్వార్థపరత్వమూ, సుఖతృష్ణా ఎక్కువైనాయి. లోకమంతా ఎక్కువ జీతాలకోసం దేవురిస్తున్నది. మేలుకోవలిసిన జాతి కిది శుభసూచకం కాదేమో అంటాను. రైతుల కష్టాలు జమీందారులూ, జమీందారుల చిక్కులు రైతులూ; అబ్రాహ్మణుల హీనసంస్కారాన్ని బ్రాహ్మణులూ, వారి నిస్సహాయతని అబ్రాహ్మణులూ; దేవాలయాల పవిత్రతని దేవాలయోద్యోగులూ, ఉద్యోగుల బాధల్ని అధికారులూ, ప్రజల అవసరాల్ని వర్తకులూ, వారి కష్టాల్ని ప్రజలూ, సత్యంగా గుర్తించుకుని అవతలివార్ని హింసించని పద్ధతిలో పరిష్కారం చేసుకోవాలంటాను. వాస్తవంగా వున్న స్థితి గుర్తించుకోడమూ, (ఒకే జాతిలోనివారు ఒకరినొకరు కొరుక్కుతినకుండా ఉంచే) అహింసాతత్వమూ ఇవి రెండూ మన జాతికి నేడు రెండు కళ్ళవాలి."

"........."

"చిత్తం అలాగే మనవిచేస్తాను. ఇంత లెక్చరు కొట్టినతరవాత నేను చెప్పబోయేది మరుగుపడిపోడం వింతకాదు. నా తుదిమాట ఇది: జమీందారులూ రైతులూ; బిచ్చగాళ్లూ ఉద్యోగులూ; సవర్ణులూ హరిజనులూ; బ్రాహ్మణులూ బ్రాహ్మణేతరులూ; పురుషులూ స్త్రీలూ; అందరూ మన కుటుంబంలోనివారు. మీరలా చేశారంటే మీరిలా చేశారని వీరిలో కొట్టుకోడం మన జాతికి హానికరం. కాబట్టి అసలైన (సత్య) స్థితిని అందరూ గుర్తించుకుని, హింస్రములు కాని పద్ధతులలో భేదాల్ని పరిష్కరించుకోవాలి. ఇలా జరగాలంటే గాంధీమహాత్ముని సత్యాగ్రహ పద్ధతులు జాతినంతా ఆవరించాలి. జాతికి విద్యా, విజ్ఞానమూ కావాలి. ప్రేమా, పురోభివృద్ధీ అనే రెండు వెలుగులు నడపాలి సంస్కర్తల్ని. జమీందారీ బిల్లుకోసం దండడించేవారిలో ఈ రెండు వెలుగులూ లేవేమో అని నా అనుమానం. కాబట్టి ఈ బిల్లు ఫలితం ఆరోగ్యకరంగా వుంటుందా అని సందేహిస్తున్నాను."

---

* ఆనందవాణి